ఆర్టీఐ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలి

నేటి ప్రభాత సూర్య న్యూస్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి:- మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సమాచార హక్కు చట్టం--2005 ప్రకారం పౌరులు కోరిన సమాచారాన్ని సకాలంలో అందించాలని అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఆర్టీఐ వారోత్సవం--2026 అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. వీలైనంత మేర స్వచ్ఛందంగా సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా అధికారులు, సిబ్బందితో సమాచార హక్కు చట్టంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్వో మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి దిక్సూచి

తెలుగు దినపత్రిక

# విద్యార్థినుల పేరుతో రోడ్డు..

# 'రియల్' కథేంటి?

## కేజీబీవీ కోసమా.. వెంచర్ ప్రయోజనం కోసమా?

## గతంలోనే ప్రత్యేక రహదారి.. ఇప్పుడు మరో రోడ్డు ఎందుకు?



మద్రిగూడ / నేటి దిక్సూచి:

మద్రిగూడ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థినుల రాకపోకల కోసం కొత్తగా రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఏమొచ్చిందనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. గతంలోనే విద్యార్థినులు, గిరిజన బాలుర వసతి గృహం విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు ప్రత్యేక మార్గం ఉన్నప్పటికీ, ప్రస్తుతం మరో రహదారిని ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థినుల సౌకర్యం కోసమే



ఈ రోడ్డు నిర్మించారా? లేక సమీపంలోని రియల్ ఎస్టేట్ వెంచర్కు ప్రధాన రహదారితో అనుసంధానం కల్పించేందుకా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

స్థానికుల వివరాల ప్రకారం.. గతంలో కేజీబీవీ విద్యార్థినులు మండల తహసీల్దార్ కార్యాలయం పక్క నుంచి రాకపోకలు సాగించేవారు. అలాంటప్పుడు పాత రహదారిని ఎందుకు మూసివేశారు? కొత్తగా మాల్--మద్రిగూడ ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న ప్రైవేట్ స్థలాన్ని సేకరించి మరో రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఏమిటి? అనే అంశాలపై అధికారులు వివరణ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థినుల రాకపోకలకు ఇప్పటికే మార్గం ఉండగా, కొత్తగా నిర్మించిన రోడ్డు వెనుక అసలు ఉద్దేశం ఏమిటన్నది స్పష్టం కావాల్సి ఉంది. ఈ వ్యవహారంపై నేటి దిక్సూచి దినపత్రికలో వరుస కథనాలు వెలువడటంతో చండూరు ఆర్డీవో శ్రీదేవి స్పందించారు. సంబంధిత రియల్ వెంచర్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి, రోడ్డు నిర్మాణానికి సంబంధించిన స్థల పత్రాలను సమర్పించాలని ఆదేశిస్తామని వెల్లడించారు.

వెంచర్కు దారి కల్పించేందుకేనా?

కేజీబీవీ పాఠశాలను ఆనుకొని సుమారు ఏడు ఎకరాల్లో కొంతమంది వ్యక్తులు రియల్ ఎస్టేట్ వెంచర్ ఏర్పాటు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ వెంచర్ నుంచి మాల్--మద్రిగూడ ప్రధాన రహదారికి అనుసంధానంగా రోడ్డు నిర్మించేందుకు అవసరమైన స్థలం లేకపోవడంతో, విద్యార్థినుల కోసం నిర్మించిన రహదారిని ఉపయోగించుకునే ప్రయత్నం జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ స్థలం నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టి, దానిని కేజీబీవీ విద్యార్థినుల రాకపోకల కోసం ఏర్పాటు చేసిన మార్గంగా చూపించారా? అనే ప్రశ్నలు గ్రామస్థుల నుంచి వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వెంచర్ నిర్వాహకుల వివరణ తెలియాల్సి ఉంది.

గతంలో కేజీబీవీ విద్యార్థినులు, ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహం విద్యార్థులు ఉపయోగించిన రహదారి ఉండగా, ఇప్పుడు కొత్తగా మరో మార్గం నిర్మించడంపై మద్రిగూడ గ్రామ యువత అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. పాత రోడ్డును మూసివేసిన కారణాలు, కొత్త రోడ్డు నిర్మాణానికి తీసుకున్న నిర్ణయాలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల సంగతేంటి?

ఈ వివాదంలో మరో కీలకమైన అంశం గతంలో నిరుపేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలు. ప్రస్తుతం రోడ్డు నిర్మించిన ప్రాంతంతో పాటు, కేజీబీవీ విద్యార్థినుల ఆటస్థలం కోసం ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన ప్రాంతంలోనూ గతంలో మద్రిగూడకు చెందిన సుమారు 70 మంది నిరుపేదలకు ప్రభుత్వం ఒక్కొక్కరికి 60 గజాల చొప్పున ఇళ్ల స్థలాల పట్టాలు అందజేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

పేదలకు కేటాయించిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే అవకాశం ఉంటే సమీపంలోని రియల్ వెంచర్పై ప్రభావం పడుతుందనే ఉద్దేశంతోనే ఈ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేపట్టారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత అనేది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

నిరుపేదలకు గతంలో కేటాయించిన స్థలాల హద్దులు ఏమిటి? ప్రస్తుతం రోడ్డు నిర్మించిన ప్రాంతం ఏ భూమి పరిధిలోకి వస్తుంది? విద్యార్థినుల ఆటస్థలంగా వినియోగిస్తున్న స్థలానికి సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? అనే అంశాలపై రెవెన్యూ అధికారులు సమగ్రంగా పరిశీలించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కేజీబీవీ విద్యార్థినుల కోసం రోడ్డు నిర్మించేందుకు ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న ప్రైవేట్ స్థలాన్ని ఎందుకు సేకరించారు? లక్షల రూపాయల విలువైన ఆ స్థలాన్ని భూ యజమాని ఏ ప్రాతిపదికన అందించారు? అనే ప్రశ్నలకు కూడా స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

సర్వే నంబర్లు 283 పి, 284 పి పరిధిలో వెంచర్

మద్రిగూడ మండల కేంద్రంలోని సర్వే నంబర్లు 283 పి, 284 పి పరిధిలో సుమారు ఏడు ఎకరాల్లో ప్రైవేట్ వ్యక్తులు రియల్ ఎస్టేట్ వెంచర్ ఏర్పాటు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ వెంచర్ నుంచి మాల్--మద్రిగూడ ప్రధాన రహదారిని అనుసంధానం చేసే మార్గం విషయంలో స్థల సమస్య ఏర్పడిందని, ఈ నేపథ్యంలో కేజీబీవీ విద్యార్థినుల కోసం నిర్మించిన రహదారిని చూపించి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) నుంచి లేఅవుట్ అనుమతులు పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వెంచర్ పక్కన ప్రైవేట్ స్థలం ఉండగా, మాల్--మద్రిగూడ ప్రధాన రహదారిని ఆనుకొని కూడా ప్రైవేట్ స్థలం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ రెండింటి మధ్యలో ప్రభుత్వ స్థలం ఉండటంతో రహదారి అనుసంధానంపై సమస్య ఏర్పడిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ స్థలాన్ని ఏ ప్రాతిపదికన వినియోగించారు? వెంచర్ అనుమతుల కోసం ఎలాంటి పత్రాలు సమర్పించారు? అనే అంశాలు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

ఈ విషయాన్ని మద్రిగూడ తహసీల్దార్ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లినప్పుడు, పబ్లిక్ రోడ్డును ఎవరైనా ఉపయోగించుకోవచ్చని, వెంచర్ వెంచర్ ఏర్పాటు చేసుకునేటప్పుడు ప్రభుత్వ స్థలాన్ని కూడా వాడుకోవచ్చు అని తెలిపినట్లు సమాచారం. అయితే వెంచర్ ఏర్పాటు చేసేవారు తమ లేఅవుట్ నుంచి ప్రధాన రహదారికి అనుసంధానంగా రోడ్డు నిర్మించేందుకు అవసరమైన స్థలం, హక్కులు, అనుమతులను నిర్ధారించుకోవాల్సి ఉంటుంది.

రోడ్డు ప్రారంభం, ముగింపు ప్రాంతాల్లో ప్రైవేట్ స్థలాలు ఉండి, మధ్యలో ప్రభుత్వ స్థలం ఉన్నట్లయితే, ఆ మార్గానికి సంబంధించిన అనుమతులు ఎలా మంజూరయ్యాయన్నది పరిశీలించాల్సి ఉంది. మండల తహసీల్దార్ కార్యాలయం, గ్రామపంచాయతీ నుంచి నిరభ్యంతర పత్రాలు జారీ అయ్యాయా? వాటి ఆధారంగానే హెచ్ఎండీఏ అనుమతులు మంజూరు చేసిందా? అనే ప్రశ్నలకు అధికారుల నుంచి సమాధానం రావాల్సి ఉంది.

వెంచర్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తాం: ఆర్డీవో



శ్రీదేవి

మద్రిగూడ మండల కేంద్రంలోని రియల్ వెంచర్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి, రోడ్డు నిర్మాణానికి సంబంధించిన స్థల పత్రాలను సమర్పించాలని ఆదేశించనున్నట్లు చండూరు ఆర్డీవో శ్రీదేవి తెలిపారు. ఈ విషయాన్ని ఆమె ఫోన్ సంభాషణలో నేటి దిక్సూచి ప్రతినిధికి వెల్లడించారు.

నేటి దిక్సూచి దినపత్రికలో గతకొన్ని రోజులుగా వెలువడుతున్న వరుస కథనాలను పరిశీలించానని, వెంచర్ నిర్వాహకుల వద్ద ఉన్న ఆధారాలను సమర్పించేలా నోటీసులు జారీ చేస్తామని ఆర్డీవో పేర్కొన్నట్లు సమాచారం.

అధికారులు చేపట్టనున్న విచారణలో రోడ్డు నిర్మాణానికి సంబంధించిన స్థల వివరాలు, ప్రభుత్వ భూమి వినియోగం, వెంచర్ లేఅవుట్ అనుమతులకు సంబంధించిన అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. విద్యార్థినుల సౌకర్యం కోసం నిర్మించిన రహదారి వెనుక ఉన్న వాస్తవాలు ఏమిటి? ప్రభుత్వ స్థలం వినియోగంలో నిబంధనలు పాటించారా? గతంలో నిరుపేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల పరిస్థితి ఏమిటి? అన్న అంశాలపై అధికారులు సమగ్ర విచారణ జరపాలని మద్రిగూడ గ్రామస్థులు కోరుతున్నారు.